# చెరువు రామ్, తేజ

### హూస్టన్, టెక్సాస్




## రామ్



అమ్మ, నాన్న, అన్నయ్య, వదిన, ఇద్దరు అక్కలు, బావలు, ఒక తమ్ముడు, ఇదీ మా ఫామిలీ ఫొటో!

మాది నెల్లూరు. మా నాన్న గారు నెల్లూరులో సీనియర్ లాయర్. ఐదుగురు పిల్లలు ఉన్న కుటుంబంలో, 4 వ వాడినైన నాకు, తమ్ముడు సారధికి తప్ప మిగిలిన వాళ్ళందరికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. ఇక కోతకి వచ్చింది, అదే పెళ్ళికెదిగింది నేనూ, వాడే!

సహజంగానే ప్రతి తల్లిదండ్రులలాగే మా వాళ్ళు కూడా పెళ్ళి సంబంధాలు చూడడం మొదలెట్టారు. అలా మొదలైన నా జీవితం అనే సినిమా "చూపులు కలిసిన శుభవేళ" సీన్‌కి ఎలా చేరుకుందంటే.....

గుండ్రాలు గుండ్రాలు తిప్పితే! అదే! Flashback అన్నమాట!

1992 M.Sc తరువాత నా స్నేహితులు అందరు లెక్చరర్‌లుగా చేరుతుంటే నేను మాత్రం హైదరాబాదు లో సంవత్సరం పాటు Diploma in computers (National Institute of Industrial Engineering – NITIE) పూర్తి చేసి. హైదరాబాద్‌లోనే ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాను. పండగలకి, శలవులకి మా నెల్లూరు వెళ్ళి గడపడం మామూలే! ఆ సంవత్సరం అనుకోకుండా ఒక స్నేహితుడి పెళ్ళికి హైదరాబాద్ నుండి నెల్లూరు వెళ్ళాల్సి వచ్చింది. సరిగ్గా అదే సమయానికి నాన్న సుప్రీం కోర్ట్ పనిమీద ఢిల్లీలో ఉన్నారు. నెల్లూరుకి రాగానే అమ్మ యధావిధిగా తను చేస్తున్న పెళ్ళి ప్రయత్నాలు ఏకరువు పెట్టింది. వాళ్ళు వచ్చారు, వీళ్ళు వచ్చారు, మంచి సంబంధం అని. అప్పుడే పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేక ఏదో సాకుతో తప్పించుకునేవాడిని. (నిజం చెప్పాలంటే! అంత త్వరగా ఉన్న స్వాతంత్ర్యం పోగొట్టుకోవడం ఇష్టంలేక.)

స్నేహితుడి పెళ్ళి అయిన మర్నాడు హైదరాబాద్ తిరుగు ప్రయాణం అనుకుంటుంటే "మొన్న ఒక పెళ్ళిలో మన బంధువుల అమ్మాయిని చూశాను. పిల్ల చక్కగా ఉంది. మన ప్రసాద్ (నా స్నేహితుడు, మేనత్త మనవడు) చెల్లెలే! అమ్మాయి మీ మేనత్త మనవరాలే. నీకు తెలుసుగా, వాళ్ళ నాన్న పోయినప్పటి నుంచి వాళ్ళు ఎంత కష్టపడ్డారో! కష్టం, సుఖం తెలిసిన కుటుంబం. అమ్మాయి మన నెల్లూరులోనే డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. పనిపాట, ఒద్దిక, అణకువ, గౌరవం అన్నీ తెలిసిన పిల్ల. కావాలంటే ఫోటో తెప్పిస్తాను, ఒకసారి చూడు" అని అమ్మ క్లాస్ మొదలెట్టింది. పెళ్ళి చేసుకోవడమే ఇష్టం లేకుంటే, ఫోటో ఎందుకు చూడడం అని నా అభిప్రాయం. అప్పట్లో అసలు పెళ్ళి చేసుకుంటే సిటీ అమ్మాయిని చేసుకోవాలి. చాలా హుషారుగా ఉంటారు అని నాకొక అభిప్రాయం. "పోయి పోయి నెల్లూరు

అమ్మాయిని చేసుకోమంటావా? ఏదైనా సిటీ సంబంధం ఉంటే చెప్పు, ఆలోచిద్దాం" అని సమాధానం చెప్పాను.

"కాదురా ఒక్కసారి అమ్మాయిని చూడు. సొంత అక్క మనవరాలే కాబట్టి నాన్న కూడా ఇష్టపడతారు. మనకు తగిన సంబంధం చేసుకోవాలిగాని సిటీ, సిటీ అంటే ఎలా" అమ్మ నసబెట్టింది. "సాయిబాబా గుడిలో పూజకు వాళ్ళంతా వస్తారు. నువ్వు కొంచం మర్యాదగా నాతోరా! ముదురు బెండకాయలాగ బ్రహ్మచారి ముదిరితే కష్టం. సంబంధాలు కూడా దొరకవు. గుడిలో అమ్మాయిని చూడు. నచ్చితే నాన్న వచ్చిన తరువాత అన్ని విషయాలు మాట్లాడుకుందాం." అని గట్టిగా హెచ్చరించింది. సరే చూసి నచ్చలేదు అని చెప్పడం పెద్ద కష్టమా! మనం మాత్రం " సిటీ అమ్మాయి " ఐడియా మర్చిపోకూడదు అనుకుంటూ " సరే" అన్నాను.

అప్పట్లో! దేవుడు, గుడి, దండాలు, ప్రదక్షిణలు మనకు బొత్తిగా పడవు.. ఐనా తప్పదు కాబట్టి అమ్మతో గుడికెళ్ళాను. అందరూ పూజ హడావుడిలో ఉండగా ఒక అమ్మాయి చక్కగా, చలాకీగా అందరినీ పలకరించడం, పూజకి కావలసినవి అందించడం చూసి ముచ్చటేసింది. కొంచం సేపు గమనించాను. ఎందుకో బాగా నచ్చింది. అమ్మ, చూపిస్తాను అని చెప్పిన "అమ్మాయి" తనే అయితే బాగుండు అనిపించింది. ఆలోచిస్తే అమ్మ చెప్పేది సబబుగానే ఉంది. ఇంత పెద్ద కుటుంబంలో సులభంగా ఇమిడి పోవాలంటే బంధువులే సరి అని. వెంటనే వెళ్ళి అమ్మను వివరాలు అడిగాను, అరె! తన గురించే అమ్మ చెప్పిందా! " అమ్మాయి బాగుంది. తన గురించి నాకు ఇంకా చెప్పాల్సింది. ముందే వచ్చి చూసేవాడిని కదా" అనిపించింది. సిటీ అమ్మాయిలు హుషారుగా ఉంటారు కాని ఇంత సంప్రదాయంగా అందరితో కలుపుగోలుగా ఉంటారా అనుకున్నాను. తనతో మాట్లాడాలనిపించి, "వెళ్ళి మాట్లాడవచ్చా" అని అమ్మని అడిగాను. "వెళ్ళి మాట్లాడు, కాని నీ వెధవ ప్రశ్నలతో విసిగించకు" అంది.

నన్ను నేను పరిచయంచేసుకుని "నీ కోసం చూస్తున్న సంబంధం తాలూకు అబ్బాయిని నేనే" అని చెప్పేసరికి సహజంగానే కంగారు పడింది. "నన్ను చేసుకోవడం ఇష్టమేనా! "అని డైరక్టుగా అడిగేశాను తను ఒక్క క్షణం ఆగి "మా అమ్మ, అన్నయ్యలను అడిగి చెపుతాను" అని సమాధానం ఇచ్చింది. "ఏదో మీ అమ్మ, అన్నయ్య చెప్పారని కాకుండా స్వంత నిర్ణయం తీసుకో! ఆలోచించుకో.. నాకైతే నువ్వు బాగా నచ్చావు" అని చెప్పేసి సమాధానం కోసం ఎదురుచూడకుండా వచ్చేసాను. మన గ్లామర్ అదీ అంత గొప్పది కదా! నచ్చకపోతుందా అని ధైర్యం.

ఈలోగా పూజ కార్యక్రమాలు అవీ ముగించుకుని అమ్మ వచ్చేసింది. "ఏంట్రా అలా ఉన్నావు? కొంపదీసి ఈ ఊరి అమ్మాయి నచ్చేసిందా ఏమిటి? అయినా నీకు సిటీ పిల్లలు నచ్చుతారని తెలిసికూడా ఈ సంబంధం చూడడం పొరపాటే" " అంటే "అమ్మా నేను ఇంకో వారం రోజులాగి హైదరాబాదు తిరిగి వెడతాను" అన్నాను. అమ్మకి అర్థం అయ్యింది, వీడికి పెళ్ళి ఘడియ వచ్చేసింది, అని. తను గుడినుంచి ఇంటికి వెళ్తుంటే అడిగాను "ఏమి ఆలోచించావు" అని. చిరునవ్వే సమాధానంగా దొరికింది. అర్థం అయ్యింది. తనకూ ఇష్టమే. తరువాత మాటల్లో తెలిసింది. తనకోసం అమ్మ, వాళ్ళమ్మతో మాట్లాడడం, నేను ఒకసారి చూసి నచ్చితే ప్రొసీడ్ అవుదామని అనుకోవడం . ఇంకేం! నాన్న ఢిల్లీ నుంచి రాగానే ముందు ఈ విషయం చెప్పాలి! పెళ్ళి చూపులు, పెళ్ళి గట్రా, జీవితం ఈస్టుమన్ కలర్ సినిమా లాగా అనిపించింది (అప్పట్లో DTSలూ 70 mmలు లేవు మరి) ఇక మా ప్రేమాయణం మొదలైంది. రోజూ ఓ రెండు గంటలు కలుసుకోవడం కబుర్లు చెప్పుకోవడం.

రెండు రోజుల్లో వెనక్కి వెళ్ళాల్సినవాడ్ని వెళ్ళలేదు, వెళ్ళలేను. నాన్న ఎప్పుడు వస్తారా, ఈ విషయం ఎప్పుడు చెపుదామా అని ఒకటే తొందర .

నాన్న చాలా సీరియస్ టైప్. అనుకున్నారంటే ఆ పని అయ్యేదాకా వదలరు. అందరికంటే నాకు నాన్నతో చాలా

చనువు. నాన్నని నవ్వించగలిగేది నేనే మరి (రాజేంద్ర ప్రసాద్ సినిమా జోకులు అవి చెప్పి బాగా నవ్విస్తూ ఉంటాను.) ఎప్పుడు కోర్టులు, కేసులు అంటూ ఉండే నాన్న కి అదో రిలీఫ్.

నాన్న ఓ వారం రోజుల్లో వచ్చేస్తున్నారు అని తెలిసింది. తొలిసారి భయం వేసింది. నాన్న ఈ పెళ్ళి సంబంధం కాదంటారేమో అని, అయినా తన బంధువులేగా కాదంటారా అని ధీమాగా ఉన్నాను. తను తెచ్చిన, మెచ్చిన సంబంధం నేను ఒప్పుకున్నాను అని అమ్మ చాలా సంతోషం గా ఉంది.

నాన్న వచ్చేసారు. హడావుడి అంతా తగ్గాక అమ్మ మా విషయం నాన్నకి చెప్పింది. నాన్న ఏమీ సమాధానం ఇవ్వలేదు. అంటే ఏదో ఉంది. ఒక రోజంతా చాలా కోపంగా ఉన్నారు. నాన్న ఢిల్లీలో ఉన్నప్పుడు వాళ్ళ స్నేహితుడొకరు ఒక అమెరికా సంబంధం తెచ్చారట .అమ్మతో మాట్లాడి ప్రొసీడ్ అవుదామని నాన్న ఉద్దేశ్యం.

నాన్న చాలా కష్టాలు పడి పైకొచ్చారు. మా తాతయ్య (అమ్మ వాళ్ళ నాన్న) చాలా సహాయం చేశారు. తనలాగ మేముకూడా జీవితంలో స్థిరపడడానికి కష్టపడకూడదు అని నాన్న అభిప్రాయం. "మంచి అవకాశం, కుదిరితే వీడు అమెరికా వెడతాడు. నెల్లూరు సంబంధం మర్చిపొండి. నేను తెచ్చిన సంబంధం ఖాయం చేసుకుందాం" అని నాన్న ఖండితంగా చెప్పేశారు. నాన్న పంతం తెలిసిందే ఒకసారి నిర్ణయం తీసుకున్నారంటే అంతే!

నన్ను పిలిపించి "చూడు, ఉద్యోగం, సద్యోగం లేకుండా పెళ్ళి చేసుకుని ఏం లాభం? నా మాట విన్నావంటే అమెరికా వెడతావు. ఆ అమ్మాయి అక్కడ డాక్టర్. నువ్వు Ph.D చేసుకోవచ్చు. చక్కగా సెటిల్ అవుతావు. నా బంధువుల సంబంధం మర్చిపో. నా బంధువులు నాకంటే నీకు ఎక్కువ కారు" అనడంతో ఒక్కసారి అదిరిపడ్డాను. "నాకు ఇష్టం లేదు, తేజనే చేసుకుంటాను, అమెరికా వెళ్ళాలి అంటే నా కష్టం మీద వెళతాను కాని, ఎవరి దయాదాక్షిణ్యాల మీద కాదు" అని తొలిసారి నాన్నకు ఎదురు సమాధానం చెప్పాను.

కానీ నాన్న నిర్ణయంతో అందరూ ఏకీభవించారు (ఎదిరించే ధైర్యం లేక). అమ్మ కూడా "నాన్నకు వ్యతిరేకంగా ఏదీ చెయ్యలేము. ఏదో నాన్నకు కూడా ఇష్టం ఉంటుంది అనే ఉద్దేశ్యంతోనే నీకు ఈ సంబంధం తెచ్చాను. ఇప్పుడు ఇలా అయ్యింది. నా మాట విని నాన్న తెచ్చిన సంబంధం ఒప్పుకో" అంది.

నా నిర్ణయం ఒకటే. మొదటిసారి చూడగానే నచ్చింది. తొలిచూపే నన్ను కట్టిపడేసింది (cinema type **లో**). ఇక ఏ సంబంధాలు చూడనని గట్టిగా చెప్పాను.

నన్ను ఎలాగైనా ఒప్పించాలని నాన్న, అక్కలని, బావలని, అన్నయ్య, వదిన అందరినీ పిలిపించారు. నన్ను మధ్యలో పెట్టి ఒక రౌండ్ టేబులు సెషన్ వేశారు . అందరి ప్రశ్న ఒకటి "నీ ఇష్ట ప్రకారం వెడితే చాలా కష్టపడతావు. ఈ అమెరికా సంబంధం చేసుకుంటే బాగుంటుంది" అని. నేను నా నిర్ణయం చెప్పేశాను. "నేను ఒకసారి ఇష్టపడిన తరువాత వెనక్కి తగ్గేది లేదు. నేను ఏమీ కులం, మతం కాని పని చెయ్యడం లేదు. మొదటిసారి చూడగానే నాకు నచ్చింది అంతే" అన్నాను . "అలాగైతే ఈ అమెరికా సంబంధం కూడా చూడు. చూసి నచ్చకపోతే అప్పుడు ఆలోచిద్దాం"అన్నారు వాళ్ళంతా . కాని నాకు మరే ఇతర సంబంధాలూ చూడడం ఇష్టం లేదు.

ఇలా వాదనలు దాదాపుగా 4 గంటలపాటు సాగింది. అక్కలు ఒకటే బాధ పడడం "నీ ఇష్టం కాదని వేరే సంబంధం చేసుకోమని చెప్పలేం, అలాగని నాన్నని ఒప్పించలేం" అని. అందరూ ఒకవైపు, నేను ఒక్కడ్నే ఒకవైపు. ఇక నేనే ఒక నిర్ణయం తీసుకొన్నాను. "నేను అసలు పెళ్ళి చేసుకోను. నన్ను ఒక రెండు మూడు సంవత్సరాలు వదిలెయ్యండి. ఈ సంబంధమే కాదు ఏ సంబంధం కూడా వద్దు" అని. అందరిలో కాస్త రిలీఫ్. ఒక్క నాన్నకు తప్ప. "అలాగైతే మా అక్కయ్య వాళ్ళతో కూడా చెప్పేస్తాం, మీరు ఇంకో సంబంధం చూసుకోండి అని" అన్నారు. మీ ఇష్టం అని వాళ్ళకు వదిలేశాను.

పైకి అలా చెప్పానే గాని నాకు ధైర్యం చాలడం లేదు. నేను ఖచ్చితంగా అంత కాలం వెయిట్ చెయ్యగలనా! తను ఏమంటుందో! కానీ తను ఎప్పుడూ నా మాటే.

అన్నట్టుగానే నాన్న వెళ్ళి వాళ్ళకు విషయం అంతా చెప్పి "ఇంకో మూడు సంవత్సరాలు పెళ్ళి ఆలోచన వద్దు అని మావాడు అన్నాడు. మీరు మా సంబంధం విషయం మర్చిపొండి " అని అన్నారు.

కానీ నాగురించి "తేజ"కి బాగా తెలుసు, నేను కేవలం pressure తప్పించుకోవాలని అలా చెప్పానని, మంచి ఉద్యోగం సంపాదిస్తే పెళ్ళికి ఎవరూ అడ్డు చెప్పరని.

తేజ వాళ్ళన్నయ్య ప్రసాద్ నాకు చిన్నప్పటినుంచి మంచి స్నేహితుడు. పైగా మా బంధువు కూడా కావడంతో బాగా క్లోజ్ గా ఉండేవాళ్ళం. తన చెల్లెలు నేను ఇష్టపడడం, మా నాన్న ఒప్పుకోకపోవడం, పెళ్ళిగోల, ఇన్ని జరిగినా నన్ను ఏ రోజూ "మా చెల్లెలుని ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావు" అని అడగలేదు, కారణం నా మీద నమ్మకం.


పెళ్ళికి ముందు తేజ

తనకు దూరంగా ఉండలేక, నెల్లూరు లోనే ఒక డిగ్రీ college లో లెక్చరర్ గా చేరాను. నాన్నకు నేను ఆ ఉద్యోగం లో చేరడం అస్సలు ఇష్టం లేదు. అసలు నేను నెల్లూరు లో ఉండడమే ఇష్టం లేదు. సిటీకి వెళ్తే మంచి అవకాశాలు వెదుక్కోవచ్చు అని.

6 నెలలు గడిచాయి. అందరూ మా పెళ్ళి గోల మర్చిపోయారు. మా పరిచయం జరిగి దాదాపు సంవత్సరం. ప్రతి రోజూ కలుసుకుంటునే ఉన్నాము. కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నాము. ఇంట్లో ఎవరికీ ఈ విషయం తెలియదు. ఈ లోగా విశాఖపట్నం లో ఉన్న మా పెద్ద బావగారు సింగపూర్ కి move అయ్యారు.

1995 జనవరిలో అక్క, పిల్లలు కి తోడుగా నేను కూడా సింగపూర్ కి వెళ్ళాల్సి వచ్చింది. ఏర్పాట్లు అన్నీ 2, 3 రోజులలో జరిగిపోయాయి. ప్రయాణం ముందు రోజు తనని కలిసి, నా ప్రయాణం సంగతి చెప్పి, సింగపూర్ లోనే ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకుని వస్తాను, నాన్నని ఒప్పించి పెళ్ళి చేసుకుందాం అని చెప్పి దిగాలుగా వెనక్కి వచ్చేశాను

ఎప్పటికైనా నాన్న ఒప్పుకుంటేనే తనని పెళ్ళి చేసుకోవాలని నా ఆశ. ఎంతకాలమైనా!

ఎయిర్ పోర్ట్‌కి అందరూ వచ్చారు. అక్క, పిల్లలు చాలా హుషారుగా ఉన్నారు, నేను తప్ప. ఎప్పుడు తిరిగి వస్తానో ఏమో! ఈలోగా తనకి సంబంధాలు చూడకుండా ఉంటారా! అనే ఆలోచన అంతా. ఇంతలో అన్నయ్య, తమ్ముడు సారధి వచ్చి, "నువ్వు నిశ్చింతగా వెళ్ళిరా! అక్కడే మంచి ఉద్యోగం చూసుకో! తర్వాత అన్నీ మేము చూసుకుంటాము. నాన్నని ఒప్పిస్తాం " అనడంతో ధైర్యంవచ్చింది.

సింగపూర్‌కి చేరిన పక్కరోజు నుంచే ఉద్యోగ ప్రయత్నం మొదలెట్టాను. తనకు రోజూ ఒక ఉత్తరం వ్రాసేవాడిని. మా సంవత్సర పరిచయంలో ఉత్తరాలు "ప్రేమలేఖలు" వ్రాసుకోవడం మొదటిసారి. అంతవరకు మాకు ఆ అవకాశం గాని అవసరంగాని రాలేదు. రోజుకొక ఉత్తరం వ్రాసుకునే వాళ్ళం. ఇప్పటి లాగా అప్పుడు, సెల్‌ఫోన్ లు, యాహూ చాట్ లు లేవు మరి. వారానికొకసారి పాకెట్ మనీతో ఫోన్ కార్డు కొని తన ఫ్రెండ్ వాళ్ళ ఇంటికి ఫోన్ చేసి తనతో మాట్లాడే వాడిని.

నాకు ఉద్యోగం సులభంగానే దొరికింది. నేను టూరిస్టు వీసా మీద సింగపూరు వచ్చాను కాబట్టి కంపెనీ వాళ్ళు ఎంప్లాయ్‌మెంట్ వీసాకి అప్లయ్ చేసి, వీసా రావాలి అంటే 3 నెలలు పడుతుంది అని చెప్పారు.

జీవితంలో మళ్ళీ కలర్స్ కనిపించాయి. 3 నెలలు భారంగా గడవగానే సరైన డాకుమెంట్స్ సబ్‌మిట్ చేయనందువల్ల నా వీసా రిజెక్ట్ అయింది. ఆ కంపెనీ వాళ్ళు wait చేసే ఓపిక లేక re-submit చెయ్యలేదు.

సింగపూరు నుండి నెల్లూరికి తిరిగి వచ్చేసాను నిరాశగా. ఖాళీగా ఉండడం ఇష్టం లేక స్కూలులో టీచర్‌గా చిన్న ఉద్యోగం లో చేరాను. Kindergarden, $1^{st}$ Grade పిల్లలకు Computer పాఠాలు చెప్పాల్సి వచ్చింది. జీవితంలో ఎంత మార్పు!! డిగ్రీ విద్యార్థులకు data structures చెప్పడం, అంతలో చిన్న పిల్లలకు fundamentals చెప్పాల్సి రావడం. చిన్నగా నెల్లూరులోనే Institutes లో Power Builder, C++ teach చెయ్యడం ప్రారంభించాను. ఉదయాన్నే 6.00నుంచి Computer classes చూసుకుని 10 నుంచి 5 వరకు స్కూలు, మళ్ళీ 6 నుంచి 9 వరకు computer classes. అలా బిజీ అయిపోయాను. మంచి పేరు తెచ్చుకుని ఇక ఊరిలోనే మంచి Training Center పెట్టాలని నా ఆలోచన.

నేను చాలా busy గా ఉంటుండం వల్ల తనే నన్ను చూడడానికి వచ్చేది. వచ్చిన కాసేపు "ఎందుకింత కష్టపడడం? హైదరాబాదుకి వెళ్ళి ఏదైనా వేరే ఉద్యోగం వెతుక్కోవచ్చు కదా" అని ఒకటే గోల. "మన పెళ్ళి విషయం అయ్యాకే ఇక ఏ ప్రయత్నం అయినా" అని నా సమాధానం. ఇక నాతో వాదించ లేక వెళ్ళిపోయేది.

ఇలా రోజులు గడుస్తుంటే 1995 August లో ఒక రోజు "నారాయణ కోచింగ్ Center" నారాయణ (Famous EAMCET coaching center in AP) నన్ను పిలిపించి "మా సంస్థలు అన్నింటిని computerise చెయ్యాలి అనుకుంటున్నాం. డేటా ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభించి మీరే అన్నీ చూసుకోవాలి ?" అని అడగడంతో స్కూలు ఉద్యోగం మానేసి "నారాయణ" లో చేరాను.

రోజూ ఎంత బిజీగా ఉన్నా సాయంత్రం ఠంచనుగా 6 నుంచి 8 వరకు తనతో ముచ్చట్లు పెట్టేవాడిని. ఇద్దరికీ ఆ time అలవాటయిపోయింది. ఏమైనా సరే, ఎన్ని పనులున్నా సరే! సాయంత్రం 6 గంటలకు వాళ్ళింట్లో హాజరు. (ప్రేమ effect అండీ బాబూ)

మంచి ఉద్యోగం, జీతం, జీవితంలో అప్పుడప్పుడే కొంచెం కొంచెం స్థిరత్వం . మా colleagues అందరికీ నా మా ప్రేమ కథ తెలిసిపోయి "3 సంవత్సరాల ప్రేమ ఏమిటయ్యా? పెళ్ళి చేసుకోక. పారిపోయైనా పెళ్ళి చేసుకో, మంచి ఉద్యోగం చేతిలో ఉందిగా" అని. కాని నాకే నాన్నను కాదని తనని పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు.

అది 1996 April. ఎప్పటిలాగే తనని కలుసుకోవడానికి వెళ్ళేసరికి, తన కళ్ళనిండా నీళ్ళు. "ఇలా ఎంతకాలం? 3 సంవత్సరాలు ఎదురు చూసాం. నాకు కూడా డిగ్రీ పూర్తికావొస్తుండడంతో మా వాళ్ళు పెళ్ళి ప్రయత్నాలు మొదలెట్టారు. మీకు మీ నాన్నని ఒప్పించే ధైర్యం లేకుంటే మన పెళ్ళి విషయం మర్చిపోండి" అని మొదటిసారి కటువుగా చెప్పింది. నేను ఏమీ సమాధానం ఇవ్వకుండా వెంటనే వచ్చేశాను. ఎన్నో ఆలోచనలు. నిజమే! ఇలా ఎంతకాలం గడుపుతాం? అసలు నాన్న ఒప్పుకుంటారా? మనసు మార్చుకుంటారా? నమ్మకం పోయింది. ఏదో ఒకటి చెయ్యాలి.

ఆ రోజు భోజనానికి నేను త్వరగా రావడం, చికాగ్గా ఉండడం చూసి అమ్మ "ఏమైందిరా అలా ఉన్నావు?" అని అడిగింది. "ఏముంది మామూలే. నా పెళ్ళిగోల. తను కనిపించి చెప్పింది. వాళ్ళు వేరే సంబంధం చూసుకుంటున్నారట. నాకు పెళ్ళి, పెటాకులు ఏమీ అఖ్ఖర్లేదు. ఇన్ని రోజులు నాన్న ఒప్పుకుంటారని time తీసుకున్నాను. ఒకవేళ ఆ ప్రస్తావన మళ్ళీ తెచ్చినా నాన్న ఒప్పుకుంటారని నమ్మకం లేదు. అసలు wait చేసింది నాన్న permission కోసం. ఏదో lifeలో కొంచం settle అయ్యి ధైర్యంగా నాన్నతో మళ్ళీ మా విషయం చెబ్దామనుకున్నాను. ఇప్పుడా అవసరం లేదు. నేను హైదరాబాద్‌కి వెళ్ళిపోతాను. నా పెళ్ళి విషయం అంతా మర్చిపొండి." అని అమ్మని పట్టుకుని భోరున ఏడ్చేశాను.

నాన్న పక్క రూంలోనే పని చేసుకుంటూ మా మాటలు వింటున్నారన్న విషయం గమనించలేదు. తర్వాత నాన్న అమ్మని అడిగారట. "వాడి గోల ఏంటి?" అని. మీరు ఒప్పుకుంటే తేజని పెళ్ళి చేసుకోవాలని వాడు ఇన్ని తిప్పలు పడుతున్నాడు. ఇంతకాలం గడిచినా మీరు ఎప్పుడు permission ఇస్తారా అని ఎదురు చూశాడు. వాడు హైదరాబాదుకు వెళ్ళిపోతాడట, పెళ్ళి గిళ్ళి ఏమి వద్దు అంటున్నాడు ఇక మీ ఇష్టం అని అమ్మ చెప్పింది. తన పర్మిషన్ కోసం నేను ఇంతకాలం గాను అని నాన్న కరిగిపోయారనుకుంటా. అద్భుతం జరిగింది పక్కరోజు ఉదయాన్నే కాఫీ ఇచ్చేటప్పుడు అమ్మ అంది "వాళ్ళను వచ్చి నాన్నతో మాట్లాడమను, ఒప్పుకునే మూడ్ లోనే ఉన్నారు " అని. అంతే తర్వాత తతంగం అంతా ఎంత స్పీడ్‌గా జరిగిపోయిందో! official పెళ్ళి చూపులు, నిశ్చితార్థం, 3 నెలల తర్వాత 1996 ఆగస్టు లో పెళ్ళి.

అందరికీ ఆశ్చర్యం. జరగదని మర్చిపోయిన సంబంధం ఎలా కుదిరిందా" అని. వీళ్ళ నాన్న ఎలా ఒప్పుకున్నారబ్బా" అని. (అనకూడదు కానీ, ఇప్పటికీ నాకు అర్థం కాని విషయం అదే! ఎలా ఒప్పుకున్నారా అని)

కొసమెరుపు ఏమిటంటే అమ్మ కూడా దాచిన రహస్యం, తేజని నేను ఇష్టపడినప్పటినుంచీ, కాబోయే కోడలివి నువ్వే అని ధైర్యం చెప్పడం, పండగలకి, పబ్బాలకి బట్టలు పంపడం చేసిందట (నాన్నకు తెలియకుండా)

సీన్ కట్ చేస్తే ..

పెళ్ళైన 2 సంవత్సరాలకి US వచ్చేశాం. మేము ప్రస్తుతం హూస్టన్ టెక్సాస్‌లో ఉన్నాము. పెళ్ళి ముందుకి ఇప్పటికి ఒకటే తేడా. నా క్రాఫు అరవింద్ స్వామి హైర్‌స్టయిల్ నుంచి అనుపం ఖేర్ హెయిర్ స్టయిల్‌కి మారిపోయింది. అంతా నీ వల్లే అని మా అవిడని అట పట్టిస్తుంటాను.
అన్నట్లు మాకు ఇద్దరు పాపలు. సంహిత(8) సింజిత(5).



## తేజ



మా వారిలాగా చాట భారతం అన్ని విషయాలు నా దగ్గర లేక పోయినా, మా పెళ్ళిగోల నా మాటల్లో ...

నానమ్మ, అమ్మ, అన్నయ్య ప్రసాద్, నేను అంటే తేజ(తేజోవతి), తమ్ముడు శ్రీనివాస్ ఇదీ మా కుటుంబం. మా నాన్న నాన్న గారు చిన్న వయసులోనే అనారోగ్యంతో చనిపోవడం వల్ల, అమ్మ మా ముగ్గురిని మా పల్లెటూరులోనే 10 వరకు చదివించింది. అన్నయ్య ఇంటర్ మీడియట్ నుంచి నెల్లూరులో మా నానమ్మ వాళ్ళ తమ్ముడి (మాకు వరసకు తాతయ్య, ఇప్పుడు మా మామగారు) ఇంటిలో ఉండి చదువుకునే వాడు. తాతయ్య వాళ్ళ పిల్లలు అందరు పై చదువులకు హైదరాబాద్‌కి వెళ్ళినందువల్ల అన్నయ్య వాళ్ళింటిలోనే ఉండి చదువుకునే వాడు. బంధుత్వం ప్రకారం మేము అమ్మమ్మ, తాతయ్య అని పిలిచే వాళ్ళం. వాళ్ళే ఇప్పటి మా అత్తగారు, మామ గారు.

1991 లో నేను నెల్లూరు కాలేజ్‌లో ఇంటర్ మెదటి సంవత్సరం చదివేటప్పుడు కాలేజి హాస్టల్‌లో ఉండేదాన్ని. హాస్టల్‌లో నేను తీసుకున్న ఫోటోలు అప్పుడప్పుడు అన్నయ్యకు పంపేదాన్ని. వాటిని మా అత్తగారు చూసేవారట.

ఒక రోజు మా బంధువుల పెళ్ళికి వెళ్ళినప్పుడు, అక్కడ మా అన్నయ్య నన్ను మా అత్తగారికి పరిచయం చేసారు. బంధువులమే అయినా ఆమె నన్ను చూడడం మొదటిసారి. నేను ఎలా డ్రెస్ చేసుకుంటే బాగుంటానో నాకు చెప్పారు. అంతే మేం మళ్ళీ కలవలేదు.

తరువాత కొన్ని రోజులకు ఒక రోజు అన్నయ్య, మా అమ్మతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి అని చెప్పి పక్క గదిలో మాట్లాడుతుంటే ఉత్సాహం పట్టలేక, ఏం మాట్లాడుకుంటున్నారా ఒక చెవు వేసాను. మా అత్తగారికి నేను



పెళ్ళి చూపులుకి పంపిన ఫోటో

బాగా నచ్చానట, "మా రెండో వాడు రాంబాబు కి మీ చెల్లెలిని ఇస్తారా" అని అడిగి ఒక ఫోటో పంపారు (మామూలుగా అమ్మాయి ఫోటో పంపిస్తారు.. మా కేసులో అది రివర్స్ అయింది..అంతే) అసలు పెళ్ళి చేయాలా వద్దా.. అని మా వాళ్ళంతా మాట్లాడుకున్నారు. అందరు నిద్రపోయిన తర్వాత నేను ఫోటో చూసాను, మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే ఏదో ఆకర్షణ. ఏమీ తెలియనట్లు ఫోటో అక్కడే పెట్టేసాను. అప్పుడు నా వయసు 16. తరవాత కొన్ని రోజుల దాకా ఎవరు ఆ పెళ్ళి సంబంధం మాట్లాడలేదు.. ఏమైందో ఏమో..

హఠాత్తుగా ఒక రోజు అన్నయ్య వచ్చి అమ్మతో " రాంబాబు (రాం మోహన్) హైదరాబాదు నుంచి ఏదో స్నేహితుడి పెళ్ళికి వచ్చాడు, పెళ్ళి చూపులు అంటే తను రాడట అందుకని తేజాని సాయిబాబ గుడికి తీసుకురమ్మన్నారు" అని చెప్పాడు. ఆ విషయం నాకు చెప్పలేదు. అందరం గుడికి వెళుతున్నాం అంటే మామూలు గానే తయారయ్యాను. మా అత్తగారు, వాళ్ళ అబ్బాయితో గుడికి వచ్చారు. ఆహా! ఫోటోలో కంటే బాగానే వున్నారే అనుకున్నాను, గుడికి అని చెప్పి పెళ్ళి చూపులు కాదు కదా

అనుకున్నాను. మాములుగా అందరితో మాట్లాడుతూ, పూజకు అన్ని ఏర్పాట్లు చేస్తున్న నా దగ్గరకు హఠాత్తుగా వచ్చి " నీకు పెళ్ళిచుపుల హీరో నేనే " అని హడలు గొట్టేసారు. అప్పుడే పరిచయం అయినా ఇలా మాట్లాడేస్తున్నాడేటంబ్బా అనుకుని నవ్వి ఊరుకున్నాను. నన్ను పెళ్ళి చేసుకోవడం ఇష్టమేనా... అంటూ కంగారు పెట్టేసారు. ఏమి సమాధానం చెప్పాలి... " మా అన్నయ్య, అమ్మ వాళ్ళని అడిగి చెబుతాను" అని సమాధానం చెప్పాను. అలా మాట్లాడుకుంటు.. అన్ని విషయాలు చెప్పేసాను. మా అమ్మ వాళ్ళు ఈ పెళ్ళి సంబధం గురించి మాట్లాడుకోవడం, ఫోటో, అత్తగారు ఒక పెళ్ళిలో నన్ను చూడడం, ఆప్యాయంగా మాట్లాడడం మొదలైనవి. గుడినుంచి మా అత్తగారు నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళారు. సమయానికి కాబోయే మామ గారు ఢిల్లీ కెళ్ళారు.. ఒక రోజంతా అక్కడే ఉండి.. సాయంత్రం మా ఇంటికి వచ్చేసాను.. కొద్ది సమయం లో తనని బాగా గమనించాను. తను ఎప్పుడు హుషారుగా, నవ్వుతూ, నవ్విస్తూ ఉండడం నాకు బాగా నచ్చాయి. ఇంటికి వచ్చేస్తుంటే తను మళ్ళీ అడిగారు "అమ్మ, అన్నయ్యల నిర్ణయం కాదు.. నీకు ఇష్టమేనా " అని. అప్పటికి ఇక నిజం చెప్పాను "ఇష్టమే" అని .. అంతే! హైదరాబాద్ తిరుగు ప్రయాణం విషయం మర్చిపోయారు..మామగారు ఢిల్లీ నుంచి తిరిగి వస్తే పెళ్ళి విషయాలు మాట్లాడుకుంటాం అని అత్తగారు చెప్పారు.

తను రోజు నన్ను చూడడానికి వచ్చేవారు.. వచ్చేటప్పుడల్లా ఒక రోజ్ తెచ్చేవారు.. ఒక్కోరోజు.. ఒక్కో కలర్.. రోజెస్ అమ్మిన వాడెవరో కాని ఒక చిన్న ఇల్లు కట్టుకొని వుంటాడు

ఈయన డబ్బులతో. అప్పటినుంచి.. పెళ్ళయ్యే రోజువరకు.. ఒక్క రోజు కూడా తప్పకుండా వచ్చేవారు, ఊరిలో లేకుంటే తప్ప.

మా మామగారు ఢిల్లీ నుంచి రావడం, ఈ పెళ్ళి సంబంధం కాదనడం జరిగాయి.. మా ఇంట్లో వాళ్ళందరు ఇక మనకు ఈ సంబంధం వద్దు అనుకున్నారు. కాని తను ఎప్పటికప్పుడు అన్ని విషయాలు చెబుతుండే వాడు. భయపడకు, ఎప్పటికైన మా నాన్నను ఒప్పిస్తాను.. నాకోసం ఆగు అనే వారు... ఒక రోజు మామగారు వచ్చి, మీరు వేరే సంబంధం చూసుకోండి అని గట్టిగా చెప్పి వెళ్ళారట ఈ విషయానికి అందరు దిగులు పడితే తను వచ్చి.. సర్ది చెప్పారు. . మా మామగారికి ఈ సంబంధం ఇష్టం లేదు కాబట్టి తనే వాళ్ళ నాన్నను ఒప్పించాలి. మామగారు అనుకున్న పట్టు విడవరు అంటుండే వారు అని అంతా అంటూ ఉంటుంటే, మరి మా పెళ్ళి జరుగుతుందా!! అని నాకు నమ్మకం పోయింది.

సంవత్సరం గడిచింది, తను ఏ మాత్రం మారలేదు.. నాకోసం నెల్లూరు లోనే జాబ్‌లో చేరారు.. మా ఇద్దరికి పారిపోయి పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు. ఎంత కాలం అయినా ఆగుదాం అనుకున్నాం.

తను సింగపూర్‌కి వెళ్ళినప్పుడే మేం తొలిసారి ప్రేమలేఖలు రాసుకున్నది. అప్పుడే తెలిసింది "దూరమైన కొలది పెరుగును అనురాగం" అన్న సినిమా పాట ఎంత నిజమో అని. తను సింగపూరు నుంచి తిరిగి వచ్చేసిన తర్వాత .. "వేరే ఉద్యోగం చూసుకోండి హైదరాబాద్‌లో " అని నేను ఎంత బతిమాలినా " మన పెళ్ళి అయ్యాకే నెల్లూరు వదిలి పోయేది" అనేవారు.

1995 ఏప్రిల్ లో ఒక రోజు మా నాన్నమ్మ నాకు ఒక సంబధం తెచ్చింది.. "మా తమ్ముడి పంతం తెలిసిందే. ఇక ఆగడం అనవసరం, అమ్మాయికి కూడా డిగ్రీ అయిపోవచ్చింది. మన ప్రయత్నాలలో మనం ఉందాం" అని. నేను కూడా మా వాళ్ళకు ఎదురు చెప్పలేను.. ఏం చేయడం.. తను రాగానే గట్టిగా చెప్పాను.. నాకు సంబందాలు చూస్తున్నారు.. ఇక మీ ఇష్టం అని.. తను చాలా చికాగ్గా వెళ్ళి పోయారు.. నాకు చాలా బాధేసింది.. అలా మాట్లాకుండా ఉండాల్సిందేమో అని.. ఇలా ఎంతకాల ఆగను మరి.. !?

ఇక నన్ను చూడడానికి రారేమో అనుకున్నాను...ఇంటికి వెళ్ళి ఏం గొడవ చేసారో ఏమో!! తరువాత రోజే మా మామగారు, మా అమ్మని, మా నానమ్మని పెళ్ళి విషయాలు మాట్లాడాలి రమ్మన్నారు. ఇంతలో ఇంత మార్పా అని నేనే - ఆశ్చర్యపోయాను. వెంటనే నిశ్చితార్థం, 1996 ఆగష్టు 24 న మా పెళ్ళి జరిగింది. ఆరోజే రాం మోహన్, తేజోవతి కలిసి


రాంతేజ అయిన క్షణం

రాంతేజ అయ్యాము. నాకు 16 ఏళ్ళకు మొదలైన మా ప్రేమ.. నా 19 ఏళ్ళకు పెళ్ళి ఘట్టం చేరింది.

ఇప్పటికీ ఎన్ని పనులున్నా నేను, మా వారు వారాంతంలో ఒక నాలుగు గంటలు కూచొని కబుర్లు చెప్పుకుంటూ ఉంటాం.. పాత జ్ఞాపకా లు గుర్తు చేసుకుంటూ..

నా గురించి కొద్దిగా... - రామ్

నా అమెరికా పేరు రాం చెరువు, అసలు పేరు రామ్మోహన్ చెరువు, "హూస్టన్ వికటకవి" అని మారుపేరు , మా ఆవిడ అమెరికా పేరు సత్య అసలు పేరు సత్య తేజోవతి. మా ఇద్దరిది ఆంధ్రదేశం లోని నెల్లూరు, ప్రస్తుత నివాసం టెక్సాస్ లోని హూస్టన్. మాకు ఇద్దరు పిల్లలు సాయి సంహిత (8 సం) సాయి సింజిత (5 సం ). వృత్తి హూస్టన్ కెల్సి-సీబోల్డ్ ఆసుపత్రిలో ఐటీ నిపుణుడిగా. తెలుగు భాష ,సాహిత్యం, సంగీతం, సినిమాలు, హాస్యం గట్రా గట్రా నాకిష్టమైనవి . మా ఆవిడ ప్రస్తుతం తన చదువును కొనసాగిస్తోంది. కొత్త ప్రదేశాలు చూడడం, పిల్లల చదువులు మా ఆవిడ కిష్టం.

